

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

– విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

**తలుపు తెరుచుకుంది**. స్వదేశపు స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటూ, మాతృభూమిపై కాలు పెట్టగానే నా గుండె ఝల్లుమంది. నా కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు ఉబికి వచ్చాయి.

"చేత్తో నేలను తాకి నా తలపై ఉంచుకున్నాను. నన్నే చూస్తున్న మీ అమ్మ కళ్ళలో కూడా నీళ్ళు నిండాయి. తనుకూడా నన్ను అనుసరించి భారత భూమిని చేతితో తాకి తలపై ఉంచుకుంది.

ఆమె నా చెయ్యి పట్టుకుని "ప్రాణాలతో చేరాం డాక్టర్" అంది. ఇద్దరి మనసుల్లో ఒక ఉద్వేగం. 'మన దేశానికి వచ్చేశాం' అన్న ఒక అపురూపమైన భావన అది.

"ఆమె చెయ్యి కంపించటం గమనించిన నేను 'కాసేపు ఇలా కూర్చుందాముదా వసూ' అంటూ లాంజ్‌లో ఒక ఛెయిర్‌లో కూర్చోబెట్టాను. కూల్‌డ్రింక్ తాగి కాస్త కుదుటపడ్డాం,

"వసూ మనం ముందు జైపూర్‌కు వెళ్దాం. ఆ తర్వాత వైజాగ్‌కు వెళ్దాం. సరేనా?" అన్నాను.

"సరికాదు డాక్టర్" అంది.

"ఎందుకు సరికాదు?" అడిగాను.

"మీరు ముందు పేరెంట్స్‌కి చెప్పండి మన గురించి. ఆ తర్వాతే ఇద్దరం వెళితే మంచిది అనిపిస్తుంది" నెమ్మదిగా అంది.

"అనుకోకుండా నా మూడ్ అసహనంగా మారింది.

"తర్వాత అంటే?" అన్నాను.

"వాళ్ళు మనని రమ్మని పిలిచినప్పుడు. దయచేసి ముందు మీరు వెళ్ళండి డాక్టర్" అంది తలవాల్చి.

"సిల్లీగా వుంది వసూ. అంత విపత్కర పరిస్థితులలోనుంచి ప్రాణాలతో బయటపడి వచ్చాం. వాళ్ళెంత ఎదురు చూస్తారో తెలుసా?" ఆవేశంగా అన్నాను.

"ప్లీజ్ అభీ.. మీరు వెళ్ళండి ముందు.." అభ్యర్ధిస్తున్నట్టుగా చెప్పింది.

ఆమె చేతిని నా చేతిలోకి తీసుకున్నాను. "ప్లీజ్ వసూ, నా మాట విను. మా తల్లితండ్రులు చాలా మంచివారు. సంస్కారవంతులు. నా సంతోషమే కోరుకుంటారు వారు" చెప్పాను.

తను ఒకసారి నా ముఖంలోకి చూసి 'సరే మీ ఇష్టం అలాగే వెళ్దాం జైపూర్‌కు' అంది.

తేలికగా ఊపిరి తీసుకున్నాను ఒప్పుకున్నందుకు.

"కాని ఆమెను బలవంతంగా జైపూర్‌కు తీసుకు వెళ్ళినందుకు ఇప్పటికీ నా మనసు పశ్చాత్తాప పడుతూనే వుందిరా హేమా!"

"జైపూర్‌కు చేరాం. నా వాళ్ళను చూడబోతున్నందుకు మనసు ఉరకలు వేసింది. గుండెనిండా సంతోషం. కారు ఆగగానే చెట్ల పూలు కోస్తున్న చెల్లి వసంతసేన పరుగున వచ్చింది 'అన్నయ్యా' అంటూ.

అది, చుట్టూ పూల, పళ్ళ చెట్లతో విశాలంగా ఉన్న ఆవరణ. మధ్యన అందమైన మూడంతస్తుల భవనం.

"నాకు మాటలు కరువయ్యాయి. వసంతను దగ్గరకు తీసుకున్నాను. నా కళ్ళు వర్షిస్తున్నాయి. తిరిగి ఎవర్నీ చూస్తాను అనుకోలేదు కదరా హేమా. వసంతకు అన్నయ్యల కంటే నేనంటే ప్రాణం."

కళ్ళు ఒత్తుకుంటున్న తండ్రిని చూసి హేమంత్ కళ్ళు కూడా చెమ్మగిల్లాయి.

"అపుడు.. ఏమైంది డాడ్?" నెమ్మదిగా అడిగాడు. అతడి మనసు, తండ్రి మాటలలో అంతర్లీనంగా ఉన్న బాధను పసికట్టింది.

మా చిన్నప్పట్నుంచీ ఉన్న నౌకరు భజరంగ్ పరుగున వచ్చాడు. అతడు వస్తూనే నన్ను చుట్టేసుకున్నాడు.

"అక్కడ యుద్ధం అంటకదా! అమ్మ, అయ్య మీ కోసం బెంగపెట్టుకున్నారు బాబూ' అన్నాడు.

అతడు కారులోని లగేజ్ తీస్తున్నాడు.

అంతలో వసు కార్లోంచి దిగింది. ఆమెను చూస్తూనే వసంత నెమ్మదిగా లోపలకు వెళ్ళిపోయింది.

భజరంగ్ లగేజ్ లోపలకు తీసుకు వెళ్ళాడు 'చినబాబు వచ్చాడయ్యా ' అని పెద్దగా చెపుతూ.

"ఒక్క క్షణం వసూని చూసి ఆగినా, అమ్మా నాన్నగారు ఆత్రంగా ముందుకు వచ్చారు.

నన్ను దగ్గరగా తీసుకుని దుఃఖించారు. కళ్ళు తుడుచుకుని వారి పాదాలకు నమస్కరించాను. వసు కూడా వారి పాదాలను తాకి నమస్కరించింది.

"అమ్మా తను వసుమతి. అరేబియాలో" అని పరిచయం చేయబోయాను.

అమ్మ 'ముందు స్నానం చేసి రండి. భోజనం చేద్దురుగాని' అంటూ ఒక పనమ్మాయిని పిలిచి వసూ లగేజ్‌ను పైకి పంపించింది. ఆమెకు ఏమి కావాలో చూడమని చెప్పింది. ఆ తర్వాత వసూని భోజనానికి రమ్మని పిలిపించింది అమ్మ.

నాతోపాటు వసూకి కూడా తనే ప్రేమగా వడ్డించింది. భోజనాలు అయి కూర్చున్నాం. అమ్మ గట్టిగా చెప్పింది నాకు, ఇక దేశం వదిలి వెళ్ళటానికి వీల్లేదని.

"టివిలో వార్తలు చూస్తుంటే మా గుండెలు దుఃఖంతో అవిసిపోయేవిరా అభీ' అంటూ నా తల నిమురుతూ దుఃఖిస్తున్న అమ్మను దగ్గరకు తీసుకుని ఓదార్చాను.

నాన్నగారు జైపూర్‌లో వున్న మరో పెద్ద బిల్డింగ్‌ను, నాకు హాస్పిటల్‌కు కావలసినట్లు మార్పిస్తాను, అందులో ప్రాక్టీస్ పెట్టమన్నారు.

అంతలో అమ్మ, ఆ అమ్మాయి వాళ్ళ ఊరుకు పంపించే ఏర్పాటు చేయమని అంది.

'పాపం వాళ్ళ వాళ్ళు కూడా వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తూ వుంటారు కదా' అంది అమ్మ.

నేను చటుక్కున వసూవైపు చూశాను. తను అలాగే చూస్తుంది నా వైపు ఏభావం వ్యక్తం చెయ్యకుండా.

బహుశా అమ్మ ఏం చెప్పిందో ఆమెకు అర్ధమై ఉండదు అనుకున్నాను, భాష తెలియని కారణంగా.

మా వదినల కుతూహలం గమనించాను. 'ఆమె కూడా డాక్టరేనా అభీ? మీతో ఎందుకు వచ్చింది, అసలు వాళ్ళది ఏ ఊరు?' అడిగింది పెద్ద వదిన.

'అవును' అని చెప్పాను ఆమె మొదటి ప్రశ్నకు సమాధానం. నా ముఖంలోకి చూస్తున్న అమ్మకు దగ్గరగా వెళ్ళాను.

'అమ్మా, ఆమె వసుమతి. నా భార్య, తనూ ఇక్కడ మనతోనే వుంటుంది ' అని చెప్పాను.

"అమ్మ విస్మయంగా చూసింది నా కళ్ళలోకి. ఆమె కళ్ళలో సన్నటి నీటి పొర చూసి చాలా బాధనిపించిందిరా హేమా. తను నన్ను తన ఒడిలో పెంచిన అమ్మ కదరా."

హేమంత్ ఆత్రంగా అడిగాడు "నానమ్మ ఏమంది డాడ్?"

"అమ్మ ఏమీ అనలేదురా! అమ్మను దగ్గరకు తీసుకున్నాను. 'అమ్మా నేను తప్పు చేయలేదమ్మా. అక్కడ క్షణ క్షణం మృత్యువుతో పోరాడం. నాకు తీవ్ర అస్వస్థత చేసింది. తిరిగి ఇలా వచ్చి నిన్ను చూస్తాను అనుకోలేదు. ఆ సమయంలో వసు నాకు రేయింబవళ్ళు సేవలు చేసి బ్రతికించింది. అపుడు తనలో నాకు అమ్మ కనిపించింది. ఆ విపత్కర పరిస్థితుల్లో ఒకరికొకరం తోడుగా నిలిచాం. ఆ ఆత్మీయతే మాకు బంధమైంది. ఆ బంధానికి మీ దీవెనలు కావాలమ్మా!' అన్నాను కంపిస్తున్న స్వరంతో.

పెద్దన్న విక్రం ఆవేశంగా నా వైపు దూసుకు వచ్చాడు.

'విక్రం ఆగు. నన్ను మాట్లాడనియ్' అంటూ అమ్మ వెళ్ళి అతడికి అడ్డుగా నిలిచింది.

'ఏదో ఇక్కడ గతిలేనట్టు ఖండాంతరాలకు పోయి నువ్వు చేసిన నిర్వాకం ఇదా? ఇంతకన్నా నువ్వు అక్కడే ఛస్తే బాగుండేది. అనవసరంగా తిరిగి వచ్చావ్. పైగా దానిలో అమ్మ కనపడిందా?' బిగ్గరగా అరిచాడు అతడు.

'మీకంటే చిన్నవాడురా అభీ. వాడు అక్కడ చచ్చి బతికి వస్తే అంత మాటంటావా?' ఆవేశంగా అంటూ అతడి చెంప ఛెళ్ళుమనిపించింది అమ్మ.

'అమ్మా' అంటూ అమ్మను పట్టుకున్నాను.

'ఆగరా విక్రం!' అంటూ నాన్నగారు కంగారుగా వచ్చారు మధ్యకు.

'భజరంగ్, చిన్నబాబువి, కోడలివి సామాన్లు తీసుకెళ్ళి పైన తూర్పువైపు గదిలో పెట్టు' నౌఖరుకు చెప్పింది అమ్మ.

నాలుగు మెట్లెక్కిన భజరంగ్ చేతిలో సూట్‌కేస్‌లను విసురుగా లాక్కుని, గుమ్మం బయటకు విసిరేశాడు అన్నయ్య. నేను తొందరగా అన్నయ్య దగ్గరకు వెళ్ళాను. 'అన్నయ్యా నన్ను క్షమించండి ప్లీజ్' అంటూ అతడి పాదాలను తాకబోయాను. అతడు నన్ను ఆవేశంగా నెట్టి పడేశాడు. రెండో అన్న ప్రతాప్ కూడా వచ్చాదు, 'ఇది ఉమ్మడి కుటుంబం, ఎవరి ఇష్టానికి వాళ్ళు నడుచుకోవటానికి వీల్లేదు' అంటూ.

'మా భార్యలు ఉన్నత కుటుంబాల నుంచి వచ్చారు. ఎవత్తెనో తెచ్చి పెళ్ళాం అని ఇంట్లో పెడితే ఊరుకోము' అరిచాడు పెద్దన్న.

'అన్నయ్యా, మీకు వదినలకు మరొక్కసారి క్షమాపణ చెప్తున్నాను. పాపం అమ్మను, నాన్నగారిని బాధించకండిరా. దయచేసి ఇంటిని నరకం చేయకండి' అంటూ బ్రతిమాలాడాను.

'ఇంతవరకు స్వర్గంలాగే వుంది ఇల్లు. దాన్ని ఇంట్లోకి తెచ్చి నువ్వే నరకంగా మారుస్తున్నావు. నువ్వు తనను ఎలా అయినా భావించుకో. నౌకర్ల కోసం కట్టిన ఇళ్ళు చాలా వున్నాయి ఒకదానిలో పెట్టుకో తీసుకెళ్ళి. ఈ ప్యాలెస్‌లో వుండాలంటే నా భార్య చెల్లెలు స్వర్ణను పెళ్ళి చేసుకో. అయినా ఇదంతా మామూలేరా.. తెర చాటున కాసుల కోసం చేరే ఇలాంటి వాళ్ళు ఉంటారులే.'

'అతడి నీచమైన మాటలకు నా మనసు ముక్కలైపోయిందిరా. అంత పెద్ద యుద్ధ ఆయుధాలు చెయ్యలేని పని అతడి మాటలు చేశాయి. నా ప్రాణం చచ్చిపోయింది ఊహించని పరిస్థితికి. వసూ ముఖంలోకి చూడలేక దుఃఖంతో తలవంచుకున్నాను.

'నోర్muయ్యరా విక్రం!' ఆవేశంగా అరిచారు నాన్నగారు.

'ఛీ దుర్మార్గుడా ఇంత నీచంగా మాట్లాడేవాడివి నా కడుపున ఎలా పుట్టావురా?' అంటూ అమ్మ నా భుజంపై చెయ్యి వేసింది దుఃఖిస్తూ, నాకు ఓదార్పుగా.

'నా చిన్నకొడుకు, కోడలు ఇక్కడే వుంటారు. ఇష్టంలేని వాళ్ళు వెళ్ళొచ్చు' ఆవేశంగా అన్నారు నాన్నగారు. అంతలో ఆయన ఆయాసంతో రొప్పటం మొదలు పెట్టారు. ఆయనను తొందరగా సోఫాలో కూర్చోబెట్టి గుండెపై చేత్తో రాసాను."

చెప్పటం ఆపి ఉద్వేగానికి గురైన తండ్రికి మరింత దగ్గరగా జరిగాడు హేమంత్.

"ప్లీజ్ డాడ్ మీరు బాధపడుతున్నారు, రేపు వింటాను రండి పడుకుందురు" అంటూ లేవదీయబోయాడు అతడిని.

"నో హేమంత్. నన్ను పూర్తిచెయ్యనియ్యి. మరొక అయిదు నిమిషాలు అంతే" గంభీరంగా మారిన తండ్రి స్వరం విని మళ్ళీ కూర్చున్నాడు హేమంత్ నిశ్శబ్దంగా.

కంగారుగా వసూను పిలిచాను. ఆమె ఒక ప్రాణం లేని బొమ్మలా నిలబడే వుంది ఒక ప్రేక్షకురాలిగా.

నాన్నగారికి బి.పి పెరిగింది. ఆయాసపడుతున్నారు. తొందరగా ఇంజెక్షన్ లోడ్ చేసి తెమ్మని పేరు చెప్పాను.

'ఓకె డాక్టర్' అంటూ బయటకు పరుగు తీసింది ఆమె. విసిరేసిన చిన్న బ్యాగ్‌ను లోపలకు తెచ్చింది. ఓపెన్ చేసి త్వరత్వరగా ఇంజెక్షన్ లోడ్ చేసి తెచ్చింది.

అమ్మ దుఃఖం కట్టలు తెంచుకుంది 'మీరు మనుషులా, రాక్షసులా ఇంత హీనంగా ప్రవర్తిస్తున్నారు. ఛీ మీ ముఖాలు చూపకండి నాకు. పొండి ఇక్కడ్నుంచి' అని అరిచిందామె.

'పోవలసింది మేం కాదు ' అంటూ కుర్చీలో కూర్చున్నాడు విక్రం.

నాన్నగారికి ఇంజెక్షన్ ఇచ్చి నెమ్మదిగా దివాను మీద పడుకోపెట్టాను. ఆయన నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నారు.

నేను నెమ్మదిగా లేచి 'మళ్ళీ వస్తానమ్మా. మన ఫ్యామిలీ డాక్టర్‌తో మాట్లాడతాను. ఆయన నాన్నగారిని చూస్తూ ఉంటారు. మీరు బాధపడకండి. ఆరోగ్యం జాగ్రత్త. త్వరలోనే మళ్ళీ వస్తానని నాన్నగారికి చెప్పమ్మా వెళ్తాం ఇప్పుడు' అన్నాను.

అమ్మ దుఃఖం కట్టలు తెంచుకుంది. అన్నయ్యలను తిట్టింది. వసూని దగ్గరకు తీసుకుంది, 'బంగారు తల్లిలా వున్నావు. అభీని జాగ్రత్తగా చూసుకో అమ్మా' అంటూ తన మెళ్ళోవున్న పచ్చల హారాన్ని తీసి వసుమతి మెళ్ళో వేసింది అమ్మ.

వసు 'అమ్మా, అన్నీ సర్దుకుంటాయి. మీ ఆరోగ్యం, మామగారి ఆరోగ్యం జాగ్రత్త. మళ్ళీ వస్తాం తప్పక' అంటున్న వసుకు దుఃఖం పొంగి వచ్చింది.

అమ్మ పాదాలను, నిద్రపోతున్న నాన్నగారి పాదాలను తాకి నమస్కరించింది.

'నన్ను క్షమించండి. నా వల్ల మీ ఇంట కలతలు' అంటూ గుమ్మం వైపు నడిచింది.

"ఆశ్చర్యపోయాను నేను. వసు అమ్మతో స్వచ్ఛమైన రాజస్థానీలో మాట్లాడింది.

అన్నయ్యలు, వదినలు నోరు వెళ్ళబెట్టి చూశారు వసూవైపు. ఆ క్షణం వరకు వసూకు వాళ్ళన్న మాటలు అర్ధంకావులే అనుకున్న నా మనసు ఆందోళనకు గురైంది.

ఒక్క క్షణం అన్నయ్యల దగ్గర ఆగాను. నా కళ్ళనుండి నీరు ఉబికి వస్తుంది.

"అన్నయ్యా ఒక్క మాట చెప్పి వెళ్ళాలి అనిపిస్తుందిరా. నేను కుదురుగా ప్రాక్టీస్ చేసుకుంటుంటే మీరేం చేశారు? ఎవరికి వైద్యం చెయ్యాలో, ఎవరికి చెయ్యకూడదో మీరు నిర్ణయించేవారు. అడుగడుగునా మీ అహంకారంతో నా వ్యక్తిత్వాన్ని కాలరాసారు. ఫలితంగా, మీ వల్లే స్వదేశానికి దూరంగా పారిపోయాను. ఇన్నాళ్ళకు తిరిగి వచ్చాను.

చిన్నవాడినన్న జాలికూడా లేకుండా మాట్లాడి నా భార్యను అవమానించారు. ఇంటినుంచి కూడా తరిమేస్తున్నారు. అన్యాయంరా అన్నయ్యలూ. నాకంటే ముందు పుట్టినంత మాత్రాన నా జీవితాన్ని మీరు శాసిస్తారా? అమ్మను, నాన్నగారిని జాగ్రత్తగా చూసుకోండి" అంటూ బయటకు నడిచాను.

అదే ఆఖరు మీ అమ్మ వసుమతి, మా అమ్మ హేమలతాదేవిని కలవటం. నేను మాత్రం వెళ్ళి చూసి వస్తూవుండేవాడిని వాళ్ళున్నంతకాలం" అభిజిత్ స్వరం గద్గదమైంది.

"మరి డాడ్, తాతయ్య, నానమ్మ?" తండ్రి చెయ్యి పట్టుకుని అడిగాడు హేమంత్.

"ఆ తర్వాత రెండు సంవత్సరాలకే ఇద్దరూ బెంగతో కృంగిపోయి మరణించారు. ఆలోగా చెల్లి వసంత పెళ్ళికూడా చేశారు.

"నాన్నగారి వీలునామాను  అనుసరించి నాకు చెందవలసిన ఆస్తుల డాక్యుమెంట్లన్నీ లాయర్ నాకు అందచేశారు. అదే ఆఖరు నేను ఇంటికి వెళ్ళటం. అలా జైపూర్‌తో రుణం తీరిపోయింది" అతడు నెమ్మదిగా లేచి వెళ్ళి పిట్టగోడ దగ్గర తాజ్‌ను చూస్తూ నిలబడ్డాడు.

హేమంత్ కూడా వెళ్ళి తండ్రి దగ్గర నిలబడ్డాడు.

"మర్చిపోయాను హేమంత్, ఆ తర్వాత వసూను అడిగాను రాజస్థానీలో ఎలా మాట్లడావ్?" అని.

తను రాజస్థాన్, కోటాలో ఆర్ ఎ పిపిలో కొన్నాళ్ళు పని చేసానని చెప్పింది."

"అవునా! మామ్ కూడా చాలా కష్టపడింది డాడ్" అన్నాడు హేమంత్.

"ఇంకా కష్టపడుతూనే వుంది నా వల్లే ఆమెకు.. కాని ఆమె చాలా గొప్పదిరా హేమా. రోడ్డుమీద కుక్కపిల్లను కూడా ప్రేమతో చేరదీసి మందులు వేస్తుంది.. అన్నయ్య అన్న మాటలకు ఆమె తిరిగి నా దగ్గర కూడా ఏం అనలేదు. అమ్మను, నాన్నగారిని తలచుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది ఎయిర్‌పోర్ట్‌లో. హేమా నీ ప్రశ్నకు సమాధానం దొరికిందా?"

మౌనంగా ఉండిపోయారు కాసేపు ఇద్దరూ.

"హేమా నీకు మరొక విషయం కూడా చెప్పాలనుకుంటున్నాను. నువ్వు పుట్టాక ఇక మరొక బిడ్డకు అవకాశం ఇవ్వలేదు నేను. నేను నా సోదరుల వల్ల ఎదుర్కొన్న సమస్యలు, నువ్వు కూడా ఫేస్ చెయ్యకూడదని ఆ కఠిన నిర్ణయం తీసుకున్నాను. పాపం మీ అమ్మ ఒకసారి అంది, నీకు తోబుట్టువు వుంటే తోడుగా ఉంటారు ఒకరికొకరు అని. నా అనుభవం నేర్పిన పాఠం అది హేమా. నీ ఒంటరితనానికి ఈ విధంగా కూడా నేనే కారణమయ్యాను" అంటూ హేమంత్‌ను దగ్గరకు తీసుకున్నాడు అభిజిత్.

హేమంత్ కళ్ళు నిండాయి అప్రయత్నంగా. మాటలు కరువయ్యాయి అతడికి.

"నువ్వు వైజాగ్‌లోనే పుట్టావ్. వసూ.. అదే మీ అమ్మ, నీకు మా అమ్మ పేరు పెట్టుకుంది."

"ఊ" అనగలిగాడు హేమంత్.

"జైపూర్ నుంచి వసూ, నేను వైజాగ్‌కు వెళ్ళాం. అక్కడ వాళ్ళ చెల్లి, తమ్ముడు ఉన్నారు. ఇద్దరికీ పెళ్ళి చేసింది కాని తన గురించిన ఆలోచనలేదు ఆమె మనసులో. వసూ తమ్ముడు, అంటే మీ మామయ్య గోపాల్ చెప్పాడు 'తల్లితండ్రులు లేని లోటు తెలియకుండా, తన సుఖం చూసుకోకుండా, తనను, చెల్లి ప్రభావతిని పెంచి, గౌరవంగా బ్రతికే మార్గాన్ని ఏర్పరచింది' అని.

"వసూ చెల్లి ప్రభావతి, తమ్ముడు గోపాల్ చూపిన ప్రేమ, ఆదరణ తోబుట్టువుల అనుబంధానికి నిర్వచనాలుగా అనిపించాయి నాకు. వసు, గోపాల్‌కు ఒక కారు కొనిచ్చిందట ఆధారంగా. అతడు దాన్ని టాక్సీగా నడుపుకుంటున్నాడు. ప్రభావతికి గవర్నమెంట్ ఉద్యోగితో వివాహం చేసింది. వాళ్ళ జీవితాలకు మంచి మార్గం చూపింది . ఆ తర్వాతే ఆమె సౌదీ అరేబియాకు చేరుకుందట.

"నేను తను చిన్న ఇంట్లో ఎడ్జెస్ట్ కాలేనని వైజాగ్‌లో ఉన్న టాప్ హోటల్‌లో ఉంచాడు మా ఇద్దర్నీ గోపాల్. అందుకోసం అప్పుచేశాడని తెలిసింది. అపుడు స్వార్ధపరులైన నా అన్నలు గుర్తుకు వచ్చారు.

అపుడే ఒక నిర్ణయం తీసుకున్నాను. నా ఆలోచనకు రూపాన్నిచ్చాను. వెతికి వెతికి ఒక మూడు అంతస్తుల బిల్డింగ్ తీసుకున్నాను వైజాగ్‌లో. ఆ ఇంటి ఓనర్ జర్మనీకి వెళ్ళిపోతున్నాడట. అతడి దగ్గర కొన్నాను. నా ఉద్దేశం అందరూ కలిసి వుండొచ్చు ఎవరి మట్టుకు వాళ్ళు విడివిడిగా ఉంటూనే.

అలా చేస్తున్న నా ఏర్పాటుకు వాళ్ళందరూ ఒప్పుకున్నారు. నేను భవిష్యత్‌ను నా లక్ష్యానికి అనుగుణంగా ఏర్పరుచుకోవటం కోసం కొంతకాలం వసూను విడిచివెళ్ళాలి.

"వసూ తన స్వంత ఇంట్లో ఉంటూనే తన ఆప్తుల మధ్య ఉండేలా చేశాను. గోపాల్ బీచ్‌లో సముద్ర కెరటాలలో పరుగులు తీస్తూ చిన్న పిల్లల్లా ఎంజాయ్ చేస్తున్న మా ఫోటో ఒకటి నాకు తెలియకుండా తీశాడు. నేను తనను వదిలి వెళ్తుంటే 'డాక్టర్ మీరు తెలియక ముందు ఎలా బ్రతికానో తెలియదు. కాని మీరు తెలిసాక, నన్ను విడిచి వెళ్తుంటే, మీరు లేకుండా ఎలా బ్రతకాలో తెలియటంలేదు" అంటూ బాధపడింది దుఃఖిస్తూ.

గోపాల్ నాకు ఇచ్చిన ఫోటోను ఆమెకు ఇచ్చాను. నాకూ బాధతో గొంతు పెగలి మాటలు రాలేదు.

"కాని మీ అమ్మను తన వారి వద్ద, అంటే తనను ప్రాణంగా ప్రేమించే తోబుట్టువులతో వదిలి నిశ్చింతగా వెళ్ళగలిగాను. నాకు ఆప్తుడు మిత్రుడు అయిన డాక్టర్ అజయ్ ఘోష్‌ను కలిశాను. కలకత్తాకు వెళ్ళి. రక్త సంబంధం కన్నా స్నేహం గొప్పదని నిరూపించే వ్యక్తిత్వం అతడిది. అతడి సహకారంతోనే ఆగ్రాలో కొన్ని ఇతర నిర్మాణాలతోపాటు తాజ్ కనిపించేంత దగ్గరగా వున్న ఈ బిల్డింగ్‌ను కూడా చాలా ఎక్కువ వెచ్చించి కొన్నాను. మీ అమ్మ రోజూ తాజ్‌ను చూడగలిగేలా.

"మా జీవితాలలో వెలుగును నింపావు నువ్వు పుట్టి. నేను వైజాగ్‌కు వస్తూ వెళ్తూ ఉండేవాడిని తరచు. నువ్వు ఒక సంవత్సరం బేబీవి అప్పుడు ఇక్కడకు వచ్చేశాం. నేను, నా మనసులోని ఊహలకు ప్రాణం పోస్తూ అనేక సంస్థలను

స్థాపించాను. ఆ పనులతో అసలు తీరిక ఉండేది కాదు. ఒకటి రెండుసార్లు వసూ అంది 'ఇన్ని కార్యక్రమాలు తలపై భారం అవుతాయేమో డాక్టర్? ఆలోచించండి బిడ్డ బాగోగులు చూసుకోవాలిగా' అని.

నా లక్ష్య సాధన దిశగానే అడుగులు వేస్తున్న నాకు ఏవీ ఆటంకాలు అనిపించలేదు. ఇదిగో, ఈ రోజు నడుస్తున్న శరణాలయాలు, ఆసుపత్రులు, శ్రమజీవుల పిల్లల కోసం పాఠశాలలు, హాస్టళ్ళు ఒక పద్ధతిగా నడవటానికి రెండు సంవత్సరాలు పట్టింది.

.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS